క్లుప్తంగా

14 నుంచి చదువంటే మాకిష్టం

రాజానగరం: స్థానిక గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 24 వరకూ విద్యార్థులకు చదువంటే మాకిష్టం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ తెలిపారు. దసరా సెలవుల్లో విద్యార్థులకు కావాల్సిన విజ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలను అనుసరించి, జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్కు, క్విజ్, దేశభక్తి పాటల పోటీలు, కథలు చదవడం – చెప్పడం వంటి కార్యక్రమాలు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ జరుగుతాయన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


పక్కకు ఒరిగిపోయిన టెలిఫోన్ స్తంభం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు కుమ్మరివీధిలో టెలిఫోన్ స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో అది ఏ క్షణంలో ఎవరి మీద పడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకుని ప్రమాదం జరగకముందే ఆ స్తంభం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సౌజన్యకు పీహెచ్‌డీ ప్రదానం

రాజానగరం: గ్యాస్ హైడ్రేట్ ఫార్మేషన్ అండర్ సిములేటెడ్ నేచురల్ కండిషన్స్ ఫర్ సస్టైనబుల్ గ్యాస్ స్టోరేజ్ అనే అంశంపై పరిశోధన చేసిన కె.సౌజన్యకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక పత్రాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం ఆమెకు అందజేశారు. పరిశోధన వర్కును నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), హైదరాబాద్‌లో నిర్వహించగా, ఎన్‌జీఆర్ఐ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ ఇంటర్నల్ గైడ్‌గా వ్యవహరించారు. నన్నయ వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ కేవీ స్వామి ఎక్స్‌టర్నల్ గైడ్‌గా ఉన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి


వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, ఏరువాక శాస్త్రవేత్తలు

గోకవరం: వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి అన్నారు. గాదెలపాలెం గ్రామంలో ఎంటీయూ 1318 రకం వరిసాగును సోమవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి సందర్శించారు. సాగులో కీలలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ వారంలో శాస్త్రవేత్తల బృందం గోపాలపురం, గాదెలపాలెంలో పర్యటించి సాగును పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ వాయిదా

సీతానగరం: సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం జరిగే బైక్ ర్యాలీని వాయిదా వేశామని రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు తెలిపారు. సోమవారం సీతానగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ ఆధ్వర్యంలో వందల మంది కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించాల్సి ఉందని, అయితే 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ర్యాలీని నిర్వహించలేదన్నారు. ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

మార్కెట్‌లో షాపుల వేలం వద్దని ఆందోళన


గోకవరం సంత ప్రదేశంలో ఆందోళన నిర్వహిస్తున్న వ్యాపారస్తులు

గోకవరం: స్థానిక సంత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపులకు వేలం నిర్వహించొద్దని వ్యాపారస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న షెడ్ల స్థానంలో పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. ఇటీవల వీటికి వేలం నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై వ్యాపారస్తులు సోమవారం సంత నిలిపివేసి ఆందోళన చేశారు. మార్కెట్‌లో షాపులను గతంలో వ్యాపారాలు నిర్వహించిన వారందరికీ కేటాయించాలని, గతంలో తాము షాపులు నిర్వహించిన స్థలంలోనే షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రామ్మోహనరావు ఆశయ సాధనకు కృషి

- జేఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు
- నిర్వాహకురాలు డాక్టర్ రాజశ్రీ
- తోకాడలో 650 మందికి వైద్య పరీక్షలు


తోకాడలో వైద్య శిబిరానికి తరలి వచ్చిన రోగులు


శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామని జక్కంపూడి రామ్మోహనరావు (జేఆర్ఎం) ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ రాజశ్రీ అన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోకాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇంత వరకూ ఎనిమిది వైద్య శిబిరాలు నిర్వహించి, సుమారు ఆరు వేలమందికి సేవలు అందించామన్నారు. ఆరోగ్య నియోజకవర్గంగా రాజానగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పంలో భాగంగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

ఉచితంగానే మోకాలు చిప్పల మార్పిడి

నియోజకవర్గంలో అవసరమైన వారికి మోకాలు చిప్పల మార్పిడికి సంబంధించిన శస్త్ర చికిత్సలను అత్యాధునిక జర్మనీ ఇంప్లాంట్ టెక్నాలజీతో తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రి సహకారంతో జేఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేయిస్తున్నామని డాక్టర్ రాజశ్రీ తెలిపారు. సాధారణంగా ఈ చికిత్సకు రూ.రెండు లక్షలు పైబడి ఖర్చు అవుతుందనన్నారు.

650 మందికి వైద్య పరీక్షలు

తోకాడలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి మండలంలోని కానవరం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ, ముక్కినాడపాకలు, రాధేయపాలెం, పాత తుంగపాడు, కొత్త తుంగపాడు, అనపర్తి మండలం పీఆర్ఫీపురం, దుప్పలపూడి తదితర గ్రామాల నుంచి రోగులు భారీగా తరలివచ్చారు. జీఎస్ఎల్, జూపిటర్ ఆస్పత్రుల సహకారంతో డాక్టర్ రాజశ్రీ పర్యవేక్షణలో సుమారు 40 మంది వైద్యులచే జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గుండె వైద్యం, స్త్రీల వైద్యం, చిన్నపిల్లల వైద్యం, చర్మవ్యాధులు, మూత్ర కోశ వ్యాధులు, నరాలు, కిడ్నీ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఛాతీ, ఊపిరితిత్తుల వైద్యం, కీళ్ల ఎముకల వైద్యం, కంటి వైద్యం, దంత వైద్యం మున్నగు వివిధ రోగాలకు సంబంధించి 650 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతోపాటు శస్త్ర చికిత్సలు చేయవలసిన వారికి అందుకు కావలసిన ఏర్పాట్లు కూడా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేగిశెట్టి వీవీచక్రధరరావు, ఎంపీటీసీ సభ్యుడు గండి వెంకట సుజాత, నెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నాని బాబు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, జీఎస్ఎల్, జూపిటర్ ఆస్పత్రుల వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


సీతానగరంలో నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కోరుకొండలో జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతి కార్యక్రమం

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో జక్కంపూడి రామ్మోనరావు వర్ధంతి నిర్వహించారు. కోరుకొండలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్య నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాడాల, బూరుగుపూడి, జంబూపట్నం, శ్రీరంగపట్నం, కోటికేశవరం గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పార్టీ నాయకులు మద్దాల రమణ, దాసరి ఏసు, ఉల్లిగణ, కటకం బాబ్జీ, బుడ్డిగ సత్తిబాబు, మేకా నెహ్రూ రాజు పాల్గొన్నారు.

ఆయన ఆశయాలే ఆదర్శం

సీతానగరం: జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాలు ఆదర్శమని మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ అన్నారు. సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో ద్వారంపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రి రామ్మోహనరావు అడుగు జాడల్లోనే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నడుస్తూ, నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలవల సత్తిబాబు, వలవల వలీ, తోరం బ్రహ్మాజీ, మట్ట మునియ్య, మద్దాల కొండలరావు, కోలా శ్రీను, చిరికి వెంకట రమణ, ఈత వీరబాబు, కోండ్రపు శ్రీను, అదికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు. చీపురపల్లిలో గోపిశెట్టి అచ్చారవు, మన్నెల్ల వెంకట్రావు ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేరళ పీఆర్‌సీ బృందం పర్యటన


దోమాడ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద కేరళ పీఆర్‌సీ బృందం

పెదపూడి: కేరళలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నుంచి వచ్చిన డాక్టర్ కేఆర్ అనితకుమారి, డాక్టర్ సాజితలతో కూడిన బృందం మండలంలోని దోమాడ ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. కాకినాడ జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో పరీక్షించారు. పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచలు మీనవల్లి శారదదేవి, డోకుబుర్ర మీనాక్షి, సచివాలయ కార్యదర్శులు ప్రసన్న ఆంజనేయులు, కృష్ణారెడ్డి, ఏఎన్ఎం మేడపాటి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి వినతి


రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న అనపర్తి రైల్వే ప్రయాణికుల అసోసియేషన్ ప్రతినిధులు

అనపర్తి: అనపర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి, రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుకు కృషిచేయాలని కోరుతూ అనపర్తి రైల్వే ప్రయాణికుల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యుడు వైడీ రామారావును కాకినాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రామారావు జన్మభూమి, గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సత్తి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడి, ఎం.దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాహా చేశారంటూ ఫిర్యాదు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో నకిలీపత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని స్వాహా చేశారని ఆరోపిస్తూ రంగంపేటకు చెందిన ర్యాలి బాబులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రంగంపేటలోని సర్వే నంబరు 501/1లో సుమారు 2 సెంట్ల భూమిని రంగంపేటకు చెందిన చీకట్ల ప్రసాద్ భార్య చీకట్ల చిన్ని పేరిట తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనికి స్థానిక వీఆర్‌ఓ సత్యనారాయణ ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌కు ధ్రువీకరణ పత్రం ఇచ్చి సహకరించారని ఆరోపించారు. వెంటనే రిజిస్ట్రేషన్ రద్దు చేయించి ప్రభుత్వ భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకోవాలని కోరారు.

సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

పెదపూడి: పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్‌లు అన్నారు. పైన గ్రామంలో గ్రామంలో సర్పంచ్ సుందరపల్లి ప్రమీల అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను వారు పరిశీలించారు. శిబిరంలో 526 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్ బాబు, సచివాలయ కార్యదర్శులు గౌతమి చంద్ర, ఎం.చిన్ని, రాజుపాలెం ఉప సర్పంచ్ నాగమళ్ల వీరభద్రరావు, కట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.


పైనలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ సుభాష్ తదితరులు


బిక్కవోలులో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ఆరోగ్య సురక్షతో భరోసా

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు రాజీవ్ అన్నారు. సోమవారం మండలంలోని బిక్కవోలు ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 557 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు దుర్గాదేవి, జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు


గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ వందనం అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్యసేవలు అందించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో డాక్టర్ మేఘన, డాక్టర్ ఏసు రాణీ వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన గర్భిణులకు వివిధ పరీక్షలు జరిపారు. వీరిలో హైరిస్క్‌లో ఉన్నవారిని గుర్తించారు. అలాగే డాక్టర్లు చైతన్య, ఎస్.రాజు మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ మాధవీలత
- దోనకాయలపల్లిలో వైద్యశిబిరం పరిశీలన


దోసకాయలపల్లిలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

మధురపూడి: ప్రజలందరి ఆరోగ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి సచివాలయం 1లో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ 110 శిబిరాలు నిర్వహించారని, లక్షల మందికి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. నవంబర్ వరకూ ఆయా గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా.. శిబిరంలో 526 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, తహశీల్దార్ పాపారావు, ఎంపీడీవో నరేష్‌కుమార్, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసి, సచివాలయం సెక్రటరీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించాలి


కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారికి అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం తాడేపల్లిలోని అసెంబ్లీ సమావేశపు హాలులో జరిగిన మహిళలు, శిశు సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో కాలానుగుణంగా వివిధ పనుల నిమిత్తం తల్లిదండ్రులు తమ పిల్లలను కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వదిలి వలస వెళుతుంటారన్నారు. ఇటువంటి సందర్భాల్లో తల్లిదండ్రులు తిరిగి వచ్చే వరకూ వారి పిల్లలను వసతిగృహాల్లో ఉంచే విధంగా ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు చేయాలని సూచించారు.

ఐదుగురి అరెస్ట్

రంగంపేట: మండల పరిధిలోని ఎస్టీరాజాపురం గ్రామ శివారు చాగల్నాడు కాలువ గట్టు వద్ద రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందేలపై తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. దాడిలో రెండు కోడిపుంజులు, రూ.1,320 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

గోకవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సోమవారం గోకవరంలో మైత్రి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఖరీఫ్ 2023 ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని ఏర్పాటు చేయాలని మండల స్థాయి అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ రాజరాజేశ్వరి మాట్లాడుతూ గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేనందున రైతు భరోసా కేంద్రాల్లోనే గోనె సంచులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లుల దగ్గర ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ పద్మజ్యోతి, ఎస్సై శివనాగబాబు, డీటీ సునీత, సొసైటీ సీఈఓలు, బీఏఏలు, వీహెచ్ఏలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాజరాజేశ్వరి

గోదావరి గట్టు.. దారుంటే ఒట్టు


గోదావరి గట్టు రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన చెట్లు


రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన భారీ గొట్టం

- రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన చెట్లు
- రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు

ధవళేశ్వరం: గ్రామంలోని సాయిబాబా గుడి నుంచి ధవళేశ్వరం కంచర్లలైన్ వెళ్లే గోదావరి గట్టుపై చెట్లు చొచ్చుకురావడంతో దారి దాదాపు మూసుకుపోయింది. మరో పక్క ఆవ డ్రైన్ నుంచి నీరు తోడేందుకు రోడ్డు మధ్యలో భారీ గొట్టాన్ని ఏర్పాటు చేయడంతో అటుగా వాహనాలు వెళ్లేందుకు సాధ్యపడని పరిస్థితిని నెలకొంది. కంచర్లలైన్ వెళ్లేందుకు స్థానికులు నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా మూసుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిపోయిన కొమ్మలు

ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు బాగా పెరిగిపోయి కొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకువచ్చాయి. అటుగా రాకపోకలు సాగించేవారికి ఇవి తగిలి గాయాలపాలవుతున్నారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండటంతో స్థానికులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుండేవారు. రాత్రి సమయాల్లో లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి రోడ్లకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా రాకపోకలకు అనువుగా రోడ్డును తీర్చదిద్దాలని సూచిస్తున్నారు.

వీధి దీపాలు లేక..

ధవళేశ్వరం – రాజమహేంద్రవరం ప్రధాన రహదారి రద్దీగా మారడంతో అధిక శాతం మంది గోదావరి గట్టు రోడ్డుపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. సాయిబాబా గుడి వరకూ రోడ్డును పుష్కరాల సమయంలో అభివృద్ధి చేశారు. కంచర్లలైన్ వరకూ స్థానికులు గోదావరి గట్టు రోడ్డు మీదుగా ప్రయాణం సాగించేవారు. ప్రస్తుతం ఈ రోడ్డులో చెట్లు పెరిగిపోవడంతో పాటు లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సీతానగరం: మండలంలోని వంగలపూడికి చెందిన గంప అప్పన్న (23) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 9 గంటలకు మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు తెలిపారు. ఈ నెల 4న అప్పన్న పురుషోత్తపట్నం కబడ్డీ ఆడటానికి వెళ్లి, రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఒళ్లునొప్పులు ఉన్నాయంటూ పడుకున్నాడు. 5వ తేదీ ఉదయం సీతానగరం బార్బర్ షాపునకు వచ్చి మసాజ్ చేయించుకున్నాడు. అక్కడే కళ్లు తిరిగి పడిపోవడంతో స్నేహితులు వంగలపూడి ఇంటికి వద్దకు తీసుకువెళ్లారు. అమ్మమ్మ లచ్చిరెడ్డి రమణ మజ్జిగ ఇవ్వడంతో వాంతులు చేసుకోగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య అందించడానికి కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా సోమవారం ఉదయం అప్పన్న మృతి చెందాడు. అప్పన్నకు తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ రమణ వద్ద ఉంటున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

కారుణ్యానంద స్వామి జీవితం ఆదర్శనీయం

సీటీఆర్ఐ: కారుణ్యానందస్వామి జీవితం అందరికీ ఆదర్శమని గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బ్రహ్మే కొండబాబు అన్నారు. నారాయణపురం వద్ద గల గౌతమీ జీవకారుణ్య సంఘం ఆశ్రమ ప్రాంగణంలో సోమవారం లక్ష్మీసౌమ్య కళాజాత బృందంచే సంస్థ వ్యవస్థాపకుడు కారుణ్యానందస్వామి చరిత్రను నాటకంగా ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ నాటకంలోని స్వామి జీవితానికి సంబంధించిన పలు సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. అనంతరం బ్రహ్మే కొండబాబు మాట్లాడుతూ కొందరు మహానుభావులు లోక కళ్యాణం కోసమే పుడతారన్నారు. కారుణ్యానంద స్వామి సంకల్ప బలమే నేటికీ ఆశ్రమాన్ని నడిపించేందుకు ఆయువుపట్టని అన్నారు. అనేక మంది దాతలు ఎంతో సాయం చేస్తున్నారన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ పాదిలి కృష్ణారావు తెలిపారు. డ్వాక్రా నగదు తమ ఖాతాలో జమ కాలేదని యానిమేటర్‌పై నల్గొండకు చెందిన బండారు కనకరత్నం ఫిర్యాదు చేశారు. రఘుదేవపురంలోని తన భూమి సోదరుల పాస్‌బుక్‌లోకి వెళ్లిందని, దానిని సరిచేయాలంలూ అమలాపురానికి చెందిన నలమాటి లక్ష్మి పద్మావతి అర్జీని అందించారు.

రాట ముహూర్తం


అనపర్తిలో దేవీ నవరాత్రులకు పందిరి రాటను ఏర్పాటు చేస్తున్న భక్తులు

అనపర్తి: స్థానిక పాతవూరు ధరణికోట ఉమామహేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద నవరాత్ర ఉత్సవాలకు సోమవారం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తూరు రాజా ఆధ్వర్యంలో ఋత్విక్‌లు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సబ్బెళ్ల చినఅమ్మిరెడ్డి, చిర్ల సూరారెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, తమలంపూడి వెంకటరెడ్డి, సత్తి పోతారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.